క్లుప్తంగా

విగ్రహావిష్కరణకు రండి


మంత్రి దామోదరకు ఆహ్వాన పత్రిక ఇస్తున్న నాయకులు

సంగారెడ్డి : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణకు రావాలని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క నాగరాజ్ గౌడ్ కోరారు. ఈ సందర్భంగా మంత్రులు దామోదర రాజనర్సింహ, మాజీ మంత్రి హరీశ్ రావు, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే చింతాప్రభాకర్, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డికి శనివారం ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఆయన వెంట గౌడ సంఘం నాయకులు ఉన్నారు.

కంప్యూటర్ల బహూకరణ


హెచ్‌ఎంకు కంప్యూటర్లు అందజేస్తున్న సురేందర్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శ్రీమాణిక్ ప్రభు ఉన్నత పాఠశాలకు వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ సర్వీసెస్(వికాస్)సంస్థ వారు రెండు కంప్యూటర్లను బహూకరించారు. ఈ సందర్భంగా వికాస్ ప్రతినిధి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ పేద పిల్లలు విద్యాభ్యాసం చేస్తున్న మాణిక్‌ప్రభు స్కూల్ విద్యార్థులు పరిజ్ఞానం పెంపొందించడానికి కంప్యూటర్లు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు ఎంపల్లి మల్లికార్జున్, కార్యదర్శి సుభాష్‌రెడ్డి, హెచ్‌ఎం.వెంకటయ్య పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


సబ్ కలెక్టర్ ఉమాహారతి

నారాయణఖేడ్: భారీ వర్షాల నేపథ్యంలో ఖేడ్ డివిజన్ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక సబ్ కలెక్టర్ ఉమాహారతి సూచించారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ పాక్షికంగా కూలిన, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండరాదన్నారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దన్నారు. డివిజన్ పరిధిలోని ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండి ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించామన్నారు.

సింగూర్ ప్రాజెక్టు వద్ద బందోబస్తు


బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్‌ఐ రాజేశ్‌నాయక్

మునిపల్లి(అందోల్): సింగూర్ ప్రాజెక్టు చూడడానికి వచ్చిన సందర్శకులు అప్రమత్తంగా ఉండాలని బుదేరా ఎస్‌ఐ రాజేశ్ నాయక్ హెచ్చరించారు. మండలంలోని బుస్సారెడ్డిపల్లి శివారు సింగూర్ ప్రాజెక్టు చూడడానికి సందర్శకులు ఎక్కువగా రావడంతో శనివారం గట్టి బందోబస్తు నిర్వహించారు. నీళ్లలోకి దిగవద్దని, జాగ్రత్తలు తీసుకోవాలని సందర్శకులకు సూచించారు. వర్షాలు కురవడంతో వాగులు, వంకలు, కల్వర్టులపై నీటి ఉధృతి పెరిగిందని చెప్పారు.

చెరువుల వద్ద పూజలు


అలుగుకు హారతులు ఇస్తున్న మహిళలు

జిన్నారం (పటాన్‌చెరు): భారీ వర్షాలతో ఉమ్మడి జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయి. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీపతిగూడెంలో పూలు, పసుపు, కుంకుమ చల్లి మహిళలు మంగళ హారతులు ఇచ్చారు. సమృద్ధిగా నీరు చేరడంతో రైతన్నలు ఈ ఏడు పంటలకు ఎలాంటి ఢోకా లేదని సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

గిరిజనుల ప్రత్యేక పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి దేవులతండాలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో గిరిజనులు శనివారం ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. శ్రావణమాసం శనివారం పురస్కరించుకుని తండాకు చెందిన గిరిజనులు పెద్ద సంఖ్యలో ఆలయం వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామికి అభిషేకం, చందన అలంకరణ పూజలు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

జిల్లా వ్యాప్తంగా శ్రీకృష్ణా జన్మాష్టమి వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు పాఠశాలు, ఆలయాలు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ప్రాంతాల్లోని కూడళ్ల వద్ద ఉట్టి కొట్టి సంతోషంగా గడిపారు. చిన్నారులు గోపిక, చిన్నికృష్ణుడి వేషధారణలో అలరించారు. పలు గ్రామాల్లో శోభాయాత్రలు నిర్వహించారు. ఆలయాల్లో అర్చకులు పూజలు నిర్వహించి భక్తులు తీర్థ, ప్రసాదాలు అందజేశారు.


తడ్కల్‌లోని పాండురంగాలయంలో.. చిన్నారులు


సంగారెడ్డి : రాంమందిర్ వద్ద ఉట్టి కొడుతున్న జగ్గారెడ్డి దంపతులు


పటాన్‌చెరు: కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తదితరులు


వట్‌పల్లి(అందోల్): గోపిక వేషధారణలో చిన్నారి


నారాయణఖేడ్: స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు


సంగారెడ్డి టౌన్: కృష్ణుడి వేషధారణలో చిన్నారి

శిథిల వంతెనపై రాకపోకలు వద్దు

- రాసోల్, ముర్కుంజాల్ రోడ్డును పరిశీలించిన సబ్ కలెక్టర్
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు


డైవర్షన్ రోడ్డును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాహారతి

కంగ్టి(నారాయణఖేడ్): శిథిలమైన వంతెన పైనుంచి రాకపోకలు నిలిపివేయడంతో పాటు డైవర్షన్ రోడ్డు ఎత్తు పెంచాలని సబ్ కలెక్టర్ ఉమాహారతి అధికారులను ఆదేశించారు. మండలంలోని ముర్కుంజాల్, రాసోల్ గ్రామాల మధ్య శిథిలమైన వంతెన వద్ద డైవర్షన్ రోడ్డును పరిశీలించారు. ఈ రోడ్డు ఎత్తు పెంచాలని పంచాయతీరాజ్ డీఈఈ మధుసూదన్‌రెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. రోడ్డుపై, వంతెనపై నీరు పారే పరిస్థితులు ఉన్నాయా అని ఇరిగేషన్ ఏఈ రవిని అడిగి తెలుసుకున్నారు. వంతెనపై రాకపోకలు నిలిపివేసినట్లు సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది మోహన్, సీఐ వెంకట్‌రెడ్డి, ఎస్‌ఐ దుర్గారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేత


మంత్రికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న రాంరెడ్డి, గిరిమహరాజ్

మునిపల్లి(అందోల్): జేష్టాదేవి శనేశ్వరులకు తైలాభిషేకం, అభిషేక కార్యక్రమాలకు రావాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోధర రాజనర్సింహకు ఆహ్వాన పత్రిక అందజేసినట్లు మాజీ ఎంపీపీ రాంరెడ్డి తెలిపారు. బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ 1008 వైరాగ్య శిఖామణి అవదూత గిరి మహారాజ్ ఆహ్వాన పత్రికను శనివారం మంత్రికి అందజేశామని చెప్పారు. 23న శని అమవాస్య సందర్భంగా దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో సాయంత్రం 5 గంటలకు తైలాభిషేకం ప్రారంభం అవుతుందని ఆయన తెలిపారు.

ఐడీపీ బస్తీలోకి వరద నీరు


సమస్యను అధికారులకు వివరిస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఐడీపీ బస్తీలోకి వరద నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి, యువజన నాయకుడు అబ్దుల్ బషీర్ మున్సిపల్ కమిషనర్‌కు వివరించారు. తక్షణమే స్పందించిన మున్సిపల్ కమిషనర్ కిషన్ పరిస్థితిని స్వయంగా పర్యవేక్షించారు. ఈ మేరకు అధికార యంత్రాంగానికి కాలనీలోకి చేరిన వరద నీటితో పాటు మురుగు కాలువల్లో పోగైన చెత్తా చెదారాన్ని జేసీబీ సహాయంతో తొలగించే చర్యలు చేపట్టారు. బస్తీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కమిషనర్ పేర్కొన్నారు. అత్యవసర సహాయం కోసం మున్సిపల్ యంత్రంగానికి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు జైపాల్ రెడ్డి, లక్ష్మారెడ్డి, స్థానిక నాయకులు బాలయ్య, వెంకటయ్య, పాండు, మధు, హరీష్, కాలనీవాసులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

18న సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ


సమావేశంలో మాట్లాడుతున్న నక్క నాగరాజ్ గౌడ్

సంగారెడ్డి: బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న 375వ జయంతిని పురస్కరించుకొని సంగారెడ్డిలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్మించిన పాపన్న విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క నాగరాజ్ గౌడ్ అన్నారు. శనివారం సంగారెడ్డిలో జిల్లా గౌడ సంఘం నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగరాజ్ గౌడ్ మాట్లాడుతూ.. ముఖ్య అతిథులుగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ , రాష్ట్ర మాజీ మంత్రి హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, జిల్లా కలెక్టర్ , జిల్లా ఎస్పీ ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొనట్లు చెప్పారు. ఈ నెల 18న సోమవారం ఉ. 9 గంటలకు ఐబీ నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమై విగ్రహం వరకు సాగుతోందన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఆడిటోరియంలో 375 వ జయంతి కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గౌడ పెద్దలు రాములుగౌడ్ , హనుమంతుగౌడ్, మల్లగౌడ్, డాక్టర్ రాజుగౌడ్, డాక్టర్ స్వామిగౌడ్, ప్రభుగౌడ్, లింగగౌడ్, విట్టల్‌గౌడ్ నాయకులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు నుంచి ఇంద్రేశం మీదుగా దౌల్తాబాద్ వెళ్లే రోడ్డు గుంతలమయం అయిందని, మరమ్మతులు చేపట్టడంలో జిల్లా అధికార యంత్రాంగం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందని సీపీఎం డివిజన్ కార్యదర్శి నాగేశ్వరరావు విమర్శించారు. ఇంద్రేశం రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని, నాలుగు లైన్‌ల రోడ్డుగా విస్తరణ చేయాలంటూ శనివారం సీపీఎం పార్టీ పటాన్‌చెరు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలను సీపీఎం సీనియర్ నాయకులు వాజిద్ అలీ, పాండు రంగారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మూర్తి, సురేశ్ కుమార్, నర్సింగ్‌రావు, రమేష్, సతీష్, భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

జహీరాబాద్ టౌన్: మేడ్చల్‌లో ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్న సీపీఐ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను శనివారం పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ డివిజన్ కార్యదర్శి నర్సింహులు మాట్లాడుతూ పార్టీ ఎల్లప్పుడూ పేదల పక్షాన ఉంటూ ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై నిలదీస్తూ పోరాటాలు చేయడంపై మహాసభలో చర్చించడం జరుగుతుందన్నారు. మూడు రోజుల పాటు కొనసాగే మహాసభలకు జహీరాబాద్ ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో తరలి వెళ్లాలని కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'మా పాఠశాలకే కేటాయించండి'

మునిపల్లి(అందోల్): తాటిపల్లి ప్రాథమిక పాఠశాల ఎస్‌జీటీ టీచర్‌ను తమ పాఠశాలకే కేటాయించాలని, డిప్యూటేషన్‌పై పంపించం సరికాదని విద్యార్థులు, వారి తల్లి దండ్రులు సంబంధిత అధికారులను కోరారు. శనివారం వారు మాట్లాడుతూ తమ చిన్నారుల విద్యాభివృద్ధి కోసం తెచ్చుకున్న ఎస్‌జీటీ టీచర్ సుజాతను సదాశివపేటకు పంపించడం సరికాదన్నారు. సంబంధిత అధికారులు స్పందించి తాటిపల్లి పాఠశాలకు పంపించాలని కోరారు. పంపించకుంటే డీఈఓ, ఎంఈఓ కార్యాలయాల వద్ద నిరసనకు దిగుతామని హెచ్చరించారు.

అనగాదేవికి సామూహిక వ్రతాలు


సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

హత్నూర (సంగారెడ్డి): హత్నూర పరిధి మాధుర గ్రామ శివారులోని దత్తాచల క్షేత్రంలో కృష్ణాష్టమి, అనగాదేవి జయంతిని పురస్కరించుకొని సామూహిక వ్రతాలు నిర్వహించినట్లు క్షేత్రాధిపతి సభాపతి శర్మ తెలిపారు. దత్తాత్రేయ స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక హోమం, పూజలు నిర్వహించినట్లు సభాపతి శర్మ తెలిపారు. సాయంత్రం శ్రీ కష్టాష్టమి సందర్భంగా గోపాల కాల్వలు ఉట్టి కొట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రామ్‌రావ్ మహరాజ్‌కు భారతరత్న ఇవ్వాలి

గిరిజన సంక్షేమ సంఘం నేత జైపాల్‌నాయక్


మాట్లాడుతున్న జైపాల్ నాయక్

సంగారెడ్డి: గిరిజనుల ఆరాధ్యదైవం బాలబ్రహ్మచారి బంజారా లంబాడా శక్తిపిట్ జాతీయ అధ్యక్షుడు సంత్ తపస్వి డా. రామ్‌రావ్ మహరాజ్‌కు భారతరత్న ఇవ్వాలని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్ డిమాండ్ చేశారు. భారతదేశంలో 15 కోట్ల జనాభా ఉన్న బంజారాలను సన్మార్గంలో నడిపించడానికి కృషి చేశారు. తమ జీవితాల్లో మార్పుకోసం ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. దేశంలోని అన్నీ రాష్ట్రాల్లో, తండాల్లో పర్యటిస్తూ దేవాలయాల నిర్మాణాలకు కృషి చేస్తూ.. భోగ్ పూజలు చేస్తూ చేడు మార్గాల నుంచి ఆధ్యాత్మికం వైపు మలచి వారిని చదువుకునేలా చైతన్యం తీసుకోవచ్చారన్నారు. ఇలా ఎన్నో అనేక కార్యక్రమాలు చేపడుతూ మహరాజ్ 85 సంవత్సరాలుగా తిండి లేకుండా ఫలహారం మీదనే వుంటూ శివైక్యం చెందారన్నారు. కేంద్ర, ప్రభుత్వం వారి సేవలను గుర్తించి భారతరత్న ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన జిల్లా నాయకులు మాజీ ఎంపీటీసీ హన్మంతునాయక్, మంగ్య పూజారి, హరిదాస్, కిషన్‌నాయక్ ఉన్నారు.

ఖేడ్‌లో భారీ వర్షం

- లోలెవల్ కాజ్‌వేలపై నుంచి భారీ వరదనీరు
- పలు చోట్ల నిలిచిన రాకపోకలు
- పరిశీలించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి


కాంజీపూర్ లోలెవల్ కాజ్‌వేపై పారుతున్న వరద నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ ప్రాంతంలో శనివారం తెల్లవారు జాము నుంచి ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. పలు లోలెవల్ కాజ్‌వేలు, వంతెనలపై నుంచి వరదనీరు పారడంతో పలు మార్గాల్లో మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. మండల కేంద్రాలైన నిజాంపేటలో 69.5 మి.మీలు, సిర్గాపూర్‌లో 51.2, కల్హేర్‌లో 40, నాగల్‌గిద్దలో 35, ఖేడ్‌లో 34, మనూరులో 31.2, కంగ్టిలో 26.4 మి.మీటర్లుగా నమోదైంది. కాంజీపూర్ సమీపంలోని తాత్కాలిక వంతెన పైనుంచి భారీగా వరద నీరు పారడంతో ప్రజలు ఇతర గ్రామాల మీదుగా రాకపోకలు సాగించారు. తాత్కాలిక వంతెన పైనుంచి వరదనీరు పారడంతో వంతెన దెబ్బతింది. ఎమ్మెల్యే సంజీవరెడ్డి, పీఆర్ డీఈఈ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డిలతతో కలిసి తాత్కాలిక వంతెనను పరిశీలించారు. తాను కాంజీపూర్ తండా రోడ్డుతోపాటు వంతెనకు నిధులు మంజూరు చేయించానని త్వరలో టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు. ఖేడ్- మన్సూర్‌పూర్ మధ్య లోలెవల్ కాజ్‌వేపై నుంచి వరదనీరు పారడంతో నాలుగైదు గంటలపాటు రాకపోకలు నిలిచిపోయాయి. గంగాపూర్ రిజర్వాయర్, వెంకటాపూర్, కమలాపూర్ చెరువులు నిండి అలుగులు పారాయి.

కేతకీ సన్నిధిలో మహారాష్ట్ర హైకోర్టు జడ్జి


పూజలు చేసిన హైకోర్టు జడ్జి

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర ఆలయంలో మహారాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ దేబద్వార్ బాలచంద్ర, కర్ణాటక ఎమ్మెల్సీ భీంరావు భస్వంత్‌రావు పాటిల్ వేరువేరుగా ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసం పురస్కరించుకుని శనివారం ఆలయానికి వచ్చిన వారికి అధికారులు, అర్చకులు మర్యాద పూర్వకంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గుండంలోని జలలింగానికి పూజలు చేశారు. అనంతరం గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి, తదితర పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించి, సన్మానించారు.

వాటర్ బాటిళ్ల పంపిణీ


విద్యార్థులకు పంపిణీ చేసిన వాటర్ బాటిల్స్


జహీరాబాద్ టౌన్: ఆర్మీ ఉద్యోగులు సొంత ఊరులోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రాగి వాటర్ బాటిల్స్‌ను అందజేశారు. మండలంలోని గోవింద్‌పూర్ గ్రామానికి చెందిన రవికుమార్, రాజు, అంజి, మైపాల్, జగన్ ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నారు. ఇటీవల వారు స్వగ్రామానికి వచ్చిన సందర్భంగా విద్యార్థులకు రాగి వాటర్ బాటిల్స్ అందించారు.

చెరువులు, కుంటల పరిశీలన


మాట్లాడుతున్న అధికారులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని నల్లవల్లిలో భారీగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో చెరువులు, కుంటలను తహసీల్దార్, ఎస్‌ఐ పరిశీలించారు. ఈసందర్భంగా భారీగా చేరిన వరద నీటితో నిండిన మల్లన్న కుంట, దబ్బకుంట, ఎర్ర చెరువు, నల్లచెరువు పత్తికుంట చెరువులను పర్యవేక్షించి చెరువులో కుంటల వద్దకు చేరకుండా నిషేధిత బోర్డులను ఏర్పాటు చేశారు. మల్లన్న కుంటకు గండి పడిందని రైతులతో చర్చించి గండిని పూడ్చేందుకు చర్యలు చేపట్టారు. అలాగే గ్రామానికి చెందిన కటిక బాలమ్మ ఇల్లు శిథిలావస్థకు చేరిందని ఆమెను సురక్షిత భవనానికి తరలించే ఏర్పాట్లు చేశారు. అంతేకాకుండా ఐదు కిలోల బియ్యాన్ని తక్షణ సహాయం కింద అందించాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో కూలిపోయిన ఇళ్లను అధికారులు పరిశీలించారు. బాధితులకు ప్రభుత్వం తరపున అండగా ఉండి ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాస్ రెడ్డి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే విద్యుత్ వెలుగులు


పట్టపగలే వెలుగుతున్న వీధిదీపాలు

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ కేంద్రంలో మిట్ట మధ్యాహ్నం విద్యుత్ దీపాలు వెలుగుతూ ఉండడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం ప్రధాన కూడలి వద్ద వీధి దీపాలు వెలుగుతూ దర్శనమిచ్చాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే విద్యుత్ వృథా అవుతుందని, తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

అధ్వానంగా కాలనీలు

సదాశివపేట(సంగారెడ్డి): అధికారుల నిర్లక్ష్యం కారణంగా పట్టణ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. చిన్నపాటి వర్షం కురిసినా పట్టణంలోని పలు కాలనీల్లో అంతర్గత మట్టి రోడ్లపై వర్షం నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అంతర్గత రహదారుల్లో ఇరువైపులా మురుగునీటి కాల్వలు నిర్మించకపోవడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని ఫయాజ్‌నగర్, రాఘవేంద్రనగర్, శ్రీకృష్ణనగర్, హనుమాన్‌నగర్, సాయినగర్, మహమ్మదీయనగర్, శంభులింగేశ్వర నగర్, ప్రియదర్శినికాలనీ, ఎవరెస్ట్ ఎన్‌క్లేవ్, శ్రీరాం నగర్ తదితర కాలనీల్లోని అంతర్గత మట్టి రహదారులపై వర్షం నీరు నిలపడంతో తీవ్రదుర్గంధం, వెదజల్లుతోందని, దోమలు, వ్యాపిస్తున్నాయని ఆయాకాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో పలు వీధుల్లోని సిమెంటు రోడ్లపై బురద నీరు నిల్వడం వల్ల వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారని వాపోయారు. అధికారులు తక్షణమే స్పందించి పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.


సదాశివపేట రాఘవేంద్రనగర్ కాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు


ఫయాజ్‌నగర్ కాలనీలో..


ఊబచెరువు కట్టపై వర్షాలకు గుంతలు పడి ఛిద్రమైన రోడ్డు